# ఎక్కడుంది నీ ఇల్లు?

**సాయంత్రం** ఆరు గంటలు!

అస్తమయ సూర్యుని అరుణ కాంతులు హుస్సేన్ సాగర్ నీటిలో వింత వింత రంగుల వలయాలు సృష్టించే సమయం!

వేసవి ఎండలకు ఉడికి పోయిన శరీరాలను హుస్సేన్ సాగర్ నీటిమీది నుంచి వచ్చే వాయు తరంగాలు చల్లగా ఓదారుస్తున్నాయి.

**జగపతి** ఆ రోజు రావలసిన సమయం కంటె చాలా ముందుగా వచ్చి కూర్చున్నాడు, టాంక్‌బండ్ మీద.

తన మిగిలిన స్నేహితులుకూడా వచ్చేస్తారేమో నని కంగారుగా చూస్తున్నాడు.

'రాకేందువదన ఇంకా రాదేం?' అని అసహనంతో బాధ పడుతున్నాడు.

మిగిలిన స్నేహితు లంతా రాకముందే ఆ అమ్మాయితో మాట్లాడెయ్యాలి!

వాళ్ళంతా వస్తే ఒక్క మాటా సరిగా మాట్లాడటానికి ఉండదు. సంభాషణ ఏ నాడూ ఒకపాయింట్ మీద నిలబడదు. ఇద్దరి మధ్య ప్రారంభమయిన సంభాషణలో మూడో వాడు చేరగానే పక్కదారి పట్టేస్తుంది. ఎవడి మటుకు వాడే తనే మాట్లాడా లని ఆరాట పడుతూ సంభాషణలో జోక్యం చేసుకోవటంతో ఎదుటి వాడి మాటలను వినే వా డెవడూ ఉండడు.

ఎవరేం మాట్లాడుతున్నారో ఎవరికీ తెలియకుండా పోతుంది. రాకేందువదన వాళ్ళ మధ్యకి వచ్చాక ఈ పరిస్థితిమరింతతారస్థాయి నందుకుంది. ఎందుకంటే వాళ్ళలో ప్రతి ఒక్కడికీ తానే ప్రముఖుడుగా విరూపించుకోవాలని తపన!

ఆ అమ్మాయితో నాలుగు రోజుల కిందట అయిన పరిచయం జగపతికి ఇంకా కళ్ళకు కట్టి నట్లుగా ఉంది.

చాలా థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియెన్స్ అది!

అలాంటి అనుభవాలు ఎప్పుడో కాని రావు.

జగపతి, లతీఫ్, శాస్త్రి, సింగ్—నలుగురూ స్నేహితులు. నలుగురివీ నాలుగు రకాల ఆఫీసులు. అయినా నలుగురూ సాయంత్రం వేళ కలుసుకునే క్లబ్ మాత్రం ఒకటే! వేసవి కాలంలో ఇంచు మించు ప్రతి సాయంత్రమూ వాళ్ళు టాంక్‌బండ్ మీద కూచుంటారు. మామూలు సోడా బాటిల్స్‌లో సోడాతోపాటు విస్కీకూడా కలుపుకుని తాగుతూ కబుర్లు చెప్పుకుంటారు. అమ్మాయిల గురించి కబుర్లంటే ఆ నలుగురికీ ఇష్టం! వాళ్ళ స్నేహానికి అదే కామన్ పాయింటేమోకూడా!

ఆ రోజు ఆ నలుగురూ తమ తమ ఆఫీసుల్లో పనిచేసే ఆడపిల్లలను గురించి రకరకాల జోక్స్ వేసుకుంటూంటే, వాళ్ళకి కొంచెం దూరంలో ఉన్న బెంచీమీద వచ్చి కూచుంది ఆ అమ్మాయి. తెలుగుదేశంలో ఒక ఆడది, వయసులో ఉన్నది, ఒంటరిగా వచ్చి టాంక్‌బండ్ మీద కూచుంది.

నలుగురిలోనూ ఒక్కసారిగా బుస్సున లేచింది కుతూహలం, ఆ అమ్మాయి ఎవరో తెలుసుకోవాలని!

చక్కగా గంజి పెట్టి ఇస్త్రీ చేసిన దేవయాని ప్రింట్స్ వాయిల్ చీర, చేతులకు ఒక్కొక్క మట్టి గాజు.

ఆమె ఒంటిమీద మరే నగలూ లేవు. చెవులకి మాత్రం తమాషాగా విచ్చి విచ్చని మల్లెమొగ్గలే దుద్దుల్లాగ పెట్టుకుంది. తను ఏం చేసినా అదొక ఫేషన్‌గా నారీలోకంతో అనుసరింప జెయ్యగలిగే అందం ఆ అమ్మాయిది. పచ్చని పసిమి చాయ! పాలరాతి బొమ్మలా కూచుని ఉంది. తన చుట్టూ బోలెడు మంది మగవాళ్ళు—అన్ని వయసుల వాళ్ళు ఉన్నారనీ, వాళ్ళంతా తనను తినేసేలా చూస్తున్నారనీ ఆ అమ్మాయికి తెలుస్తున్నట్లు లేదు. అందరి మధ్యా ఉంటూనే ఎంతో దూరంలో ఉన్నట్లున్నాయి ఆమె చూపులు. అవి నీటిలోని కాంతి వలయాలను మాత్రమే చూస్తున్నాయి.

అమ్మాయిలతో స్నేహాలు చేసుకోవటంలో వాళ్ళు నలుగురూ సిద్ధహస్తులే. అలా స్నేహం చేసుకోవటానికి రకరకాల చిట్కాలు వాళ్ళకి తెలుసు.

వెనకటికి అర్జునుడు ద్రౌపదిని తనతోతీసుకొస్తే కుంతీదేవి "మీరుఅయిదుగురూ సమంగా పంచుకోండి నాయనా" అన్నదట. ఈ చతుష్టయం ఆ పంచ పాండవుల కీవిషయంలో ఏ విధంగానూ తీసిపోలేదు.

ఎటొచ్చీ వీళ్ళు సమంగా పంచుకునేది తమ తమ భార్యలని కాదు—సంపాదించిన ఆడపిల్లల స్నేహాలని.

"ఆ అమ్మాయితో పరిచయం ఎవరు చేసు కుంటారు? పందెం పది రూపాయలు" అన్నాడు సింగ్.

ఈ సంభాషణ ఎప్పుడూ ఇలాగే ప్రారంభమవుతుంది.

"నేను. . ." అని లేచాడు జగపతి.

సాధారణంగా అతడు ముందు లేవడు. ఈ రోజు ఆ అమ్మాయి ఒక్కతే ఉంది. అదే అతని ధైర్యం.

ఆ అమ్మాయిని సమీపించి "హలో! మిస్ సుజాతా!" అన్నాడు.

ఆ అమ్మాయి తల తిప్పి మొదట జగపతిని ఆశ్చర్యంగా చూసింది. తరవాత నవ్వింది.

"మీకు నా పేరు కావాలా? రాకేన్!"

తలకిందు లయిపోయాడు జగపతి. అతడి అనుభవంలో ఎంతటి బలహీనులయిన ఆడవాళ్ళయినా మొదట కోపం తెచ్చుకోవటం, తరవాత క్రమంగా స్నేహితు లయిపోవటం ఈ తతంగమంతా ఉంటుంది! ఈ అమ్మాయి మరీ తేలిగ్గా స్నేహితురా లయిపోయింది.

"గమ్మత్తుగా ఉంది మీ పేరు! తెలుగు వారేనా?"

"అసలు సిసలైన తెలుగు బిడ్డని. నా పూర్తి పేరు రాకేందువదన! నా స్నేహితులందరూ 'రాకేన్' అని పిలుస్తారు. నాకూ అదే ఇష్టం."

"నేను మిమ్మల్ని 'రాకేన్' అని పిలవచ్చునా?"

"నాకు అభ్యంతరం లేదు!"

పదడుగుల దూరంలో ఉన్న మిత్రత్రయంలో కలవరం బయలుదేరింది.

"మన వాడు తనే హస్కు కొట్టేస్తున్నాడురా! మనకి పరిచయం చెయ్యటం లేదు!" అన్నాడు సింగ్.

"పదండి, మనమూ అక్కడికే పోదాం. ఇంక ఆలస్యం భరించలేం" అన్నాడు శాస్త్రి.

"అచ్చా!" అంటూ లేచాడు లతీఫ్.

"హలో! జగపతీ!" అంటూ ముగ్గురూ తమ చూపులు ఆ అమ్మాయి మీదే నిలిపి జగపతిని చుట్టు ముట్టారు.

జగపతి వాళ్ళను ఎర్రగా చూసినా, చచ్చినట్టు పరిచయం చేశాడు—"ఈ అమ్మాయి పేరు రాకేన్" అని.

"అచ్చమా ముస్లిం పేరులా ఉంది" అంటూ అదే బెంచీ మీద కూచున్నాడు లతీఫ్.

"మా సిక్కుల పేరులాగే ఉంది" అని ఆ బెంచీ చేతిమీద కూర్చున్నాడు సింగ్.

"మీ పేరేమోకానీ, మీరు మాత్రం పరమ పవిత్రమైన బ్రాహ్మణ కన్యలా ఉన్నారు" అని మరో చేతి మీద కూర్చున్నాడు శాస్త్రి.

ఆ అమ్మాయి ఎవరి మాటలకీ కోపం తెచ్చుకో లేదు. ఎవరికీ ప్రత్యేకించి సమాధానం చెప్పలేదు. అందరితోనూ నవ్వుతూ మాట్లాడింది.

"మీ రేం చేస్తుంటారు?" అడిగాడు లతీఫ్.


"ప్రస్తుతం ఏం చెయ్యటం లేదు. సరదాగా హైదరాబాద్ చూద్దామని వచ్చాను."


"మీ ఇల్లెక్కడ?" శాస్త్రి.

"మా ఇల్లు ఇక్కడ లేదు. నేను ప్రస్తుతం ఇక్కడ ఒక రూమ్ తీసుకుని ఉంటున్నాను."

నలుగురికీ ఒక్కసారిగా మాట లాగిపోయాయి. అందమైన ఆడపిల్ల... ఒంటరిగా రూమ్ తీసుకుని...


Ranga
సి.ఆనందా
రామం




సరదాగా హైదరాబాద్ చూడటానికి ...

"ఎక్కడుంది మీ రూమ్?"

"బర్‌కత్‌పురాలో."

"అడ్రెస్ చెప్పండి."

"చెప్పలేను. నాకీ వూరు కొత్త. నా రూమ్‌కి ఎదురుగా బోగన్‌విల్లా చెట్టు ఉంటుంది. రంగు రంగుల కాగితం పూల లాంటి పూలు ... ఎందుకూ పనికిరానివి!"

ఇదేం ఆనవాలు? ఈ సిటీలో బోగన్‌విల్లాలు ఎక్కడపడితే అక్కడే ఉంటాయి.

"నేను మీ రూమ్ కనుక్కుంటే నాకేమిస్తారు?"

పెద్ద అడ్వెంచరిస్ట్ పోజు పెట్టి అన్నాడు సింగ్.

ఫక్కున నవ్వింది ఆ అమ్మాయి, కాస్త వెటకారంగా.

"చవకబారు ఇంగ్లీషు సినిమాలో లాగ నా రూమ్ ఎక్కడుందో కనుక్కోవటం అనే విషయంపైనే నా కథంతా బేలన్స్ అయిఉంటుం దనుకుంటున్నారా? నా రూమ్ కనుక్కోవటం తేలికే. అయితే, ఆ బంగళా ముందు ఎప్పుడూ ఒక గూర్ఖా ఉంటాడు. మిమ్మల్ని లోపలికి రానిస్తాడో, లేదో?"

నలుగురూ గుటక మింగారు.

"పోనీ, మీరే మా ఆఫీసుకి రండి. కబుర్లు చెప్పుకో వచ్చు" అన్నాడు శాస్త్రి. అతడికి చొరవ ఎక్కువ.

మిగిలిన ముగ్గురూ ఒకరితో ఒకరు పోటీ పడుతూ తమ తమ విజిటింగ్ కార్డ్సు ఆ అమ్మాయికి అందించారు.

రాకేన్ తెల్లబోతూ "అదేమిటీ? మీరు ఆఫీసుల్లో కూర్చుని చేసే పని అమ్మాయిలతో కబుర్లు చెప్పటమా? ఆంధ్రదేశమా! నిన్ను ఆ భగవంతుడే కాపాడాలి" అంది.

చతుష్టయం గతుక్కుమంది.

జగపతి సర్దాడు.

"అప్పుడప్పుడు విజిటర్సు వస్తుంటారు కదా! వాళ్ళతో మాట్లాడటం కూడా ఆఫీస్ వర్క్‌లో ఒక భాగమే."

అలా ప్రారంభమైంది రాకేన్‌తో వాళ్ళ స్నేహం.

ఆ రోజుతో ఆ స్నేహానికి నాలుగు రోజుల వయసు. అప్పటికే ఆ నలుగురిలోనూ పరస్పరం ఈర్ష్యాద్వేషాలు రగులుకుంటున్నాయి.

జగపతి మనసు మరీ రగిలిపోతోంది! అందుకే ముందుగా వచ్చాడు—రాకేన్ వస్తే నాలుగూ అడిగి కడిగెయ్యటానికి. ఆ అమ్మాయి తనతో తప్పకుండా అబద్ధం చెపుతుంది. తనకు నిజం తెలుసునని చెప్పినప్పుడు ఆ ముఖం చూడాలి!

రాకేన్ వచ్చింది—ఎప్పటిలాగే— ఇస్త్రీ వాయిల్ చీరతో, మల్లె పూల దుద్దులతో.

"నిన్న మీ రెక్కడికి వెళ్ళారు?" సాధ్యమయినంత గంభీరంగా అడిగాడు జగపతి.

"లతీఫ్‌తో సినిమా కెళ్ళాను."

చిరునవ్వుతో చెప్పింది.

బిత్తరపోయాడు జగపతి! అప్పటి వరకు ఆ అమ్మాయి అబద్ధం చెప్తుందని వూహించుకుని, ఆ వంచనకి మనసులో కోపగించుకుంటున్న జగపతి ఆమె అంత సాఫీగా నిజం చెప్పేసరికి భరించలేకపోయాడు. ఒక్క అబద్ధం. చిన్న అబద్ధం. మనుష్యుల కెంత అవసరమో అప్పుడర్థమయింది అతనికి!

"నాతో సాలార్‌జంగ్ మ్యూజియంకి వస్తానన్నారు?"

"అన్నాను! కానీ లతీఫ్ ముందొచ్చాడు. సినిమాకి వెళదామన్నాడు. నాకు ఇంగ్లీష్ సినిమాలంటే ఇష్టం, మా వూళ్ళో అవి చూసే అవకాశం తక్కువ."

అంతలో మిగిలిన ముగ్గురూ వచ్చి చేరారు.

"ఇవాళకూడా సినిమాకెళదామా?" నిన్నటి చాన్సు తను పోగొట్టుకున్నందుకు బాధ పడుతూ అడిగాడు శాస్త్రి.

"ఉహూఁ! ఇవాళ నా కింకో ప్రోగ్రాం ఉంది. రావాలనుకుంటే మీ రంతాకూడా రావచ్చు!"

"వస్తాం!"

'ఎక్కడికి? ఏ ప్రోగ్రాం?' అనికూడా అడగకుండానే అన్నారు చతుష్టయం.

వాళ్ళు నలుగురికీ స్కూటర్లున్నాయి. అందరూ ఆహ్వానించారు రాకేన్‌ని తమ స్కూటర్ మీద కూచోమని! చిరునవ్వుతోనే రానని ఆటో ఎక్కింది. నాలుగు స్కూటర్లూ ఆటోని అనుసరించాయి.

ఆటో కుష్ఠురోగుల ఆశ్రమం ముందు ఆగినప్పుడు చతుష్టయం నిర్ఘాంతపోయింది.

"ఇక్కడికా?" అన్నారు అందరూ ఒక్కసారిగా చిరాకుతో, భయంతో.

"ఈ రోజు ఈ ఆశ్రమంలో వాళ్ళందరికీ నేను భోజనం పెడుతున్నాను. మీ కిష్టం లేకపోతే మీరు లోపలికి రాకండి. వాళ్ళ భోజనాలయిపోగానే నేనే వచ్చేస్తాను. మనం బిర్లామందిర్‌కి వెళదాం."

వాళ్ళు నలుగురూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

"నేనూ వస్తాను" అని శాస్త్రి ఒక అడుగు ముందుకు వేశాడు.


"మేము వస్తాం!" అని మిగిలిన ముగ్గురూ తోసుకొచ్చేశారు.

కాంపిటీషన్ అంటే కాంపిటీషనే మరి!

ఆ ఆశ్రమఆవరణలో కుష్ఠురోగులు, రకరకాల వాళ్ళు బారులు తీర్చి కూచున్నారు. చేతి వేళ్ళన్నీ పోయిన వాళ్ళు, కాలివేళ్ళుకూడా పోయిన వాళ్ళు, ముఖం నిండా పెద్ద పెద్ద బొడిపెలున్న వాళ్ళు, ఒక చెవి సగం నశించి పోగా, మరొక చెవి మాత్రమే ఉన్నవాళ్ళు—రకరకాల అంగవైకల్యంతో రోగులు!

వాళ్ళలో చాలా మందికి చేత్తో అన్నం తీసుకుని నోట్లో పెట్టుకోవటంకూడా రావటం లేదు. అలాటి వాళ్ళకి కాస్త చెయ్యి స్వాధీనంగా ఉన్న వాళ్ళు తినిపిస్తున్నారు.

వాళ్ళకి కొంచెం దూరంగా ఒక చెట్టు నానుకుని నిలబడింది రాకేన్. తమ ముందున్న ఆహారం తినాలనే




యావ తినలేని అశక్తత. వీటితో సతమతమవుతున్న ఆ అభాగ్యులను చూస్తూంది, వల్లమాలిన మమకారంతో. ఆ కళ్ళనిండా స్నేహం, దయ, సానుభూతి నెమ్మదిగా కరిగి చిన్న చిన్న నీటిబిందువులుగా కిందకు జారుతున్నాయి. చతుష్టయం చిరాగ్గా ఒకరి ముఖం మరొకరు చూసుకున్నారు.

''మోస్ట్ అన్‌రొమాంటిక్!'' గొణిగాడు లతీఫ్. మిగిలిన వాళ్ళు తల లూపారు, ఒప్పుకుంటున్నట్లు.

భోజనాలయ్యాక వాళ్ళు ప్రార్థనలు చేస్తూంటే, ''పదండి, పోదాం'' అని వచ్చేసింది రాకేన్!

''వచ్చేశారేం? వాళ్ళు భోజనం పెట్టించిన వాళ్ళ పేరు మీద ప్రార్థన చేస్తారుగా?'' అన్నాడు శాస్త్రి.

''అందుకే వచ్చేశాను. నా పేరుమీద ప్రార్థన చెయ్యటం కోసం భోజనం పెట్టించ లేదు. ఒక్కపూట వాళ్ళంతా నా భోజనం తింటూంటే చూడాలని పెట్టించాను. ఎంత విచిత్రమయిన జీవితం మన చుట్టూ...''

'ఎంత విచిత్రమయిన ఆడదీ?' అనుకున్నారు నలుగురూ.




ఆ తరవాత బిర్లా మందిర్‌కి వెళ్ళారు. రాకేన్ భక్తితో దేవుడికి దణ్ణాలు పెట్టుకోలేదు. కొబ్బరికాయలూ కొట్టలేదు. ఆలయం ఆవరణలో నిలబడి విద్యుద్దీపాల తోరణాలతో అలంకరింపబడ్డ భాగ్యనగర సౌందర్యాన్ని చూస్తూంది, పారవశ్యంతో.

''ఈవెన్నెల... ఈవెలుగులు. ..ఈపచ్చదనం...ఈ నిండుదనం...ఈ జీవితం...ఎంత అద్భుతమయినదీ'' అంది.

నలుగురు స్నేహితుల్లో ఎవరూ ఏమీ మాట్లాడలేదు. ఆ అమ్మాయి ఎంతో స్నేహంగా మాట్లాడుతూంది. చాలా సన్నిహితంగా వచ్చినట్లుగా ఉంటుంది. కానీ ఏదో సమీపించరాని అంతరం ఆమెకూ తమకూ మధ్య.

ఆమెను చూస్తూంటే చలం అరుణ గుర్తొస్తూంది, వాళ్ళకి.

''జీవితమంతా ముళ్ళలోంచి,ద్వేషాలలోంచి, నిందల్లోంచి, అపనిందల్లోంచి అంత నిర్మలంగా నడిచి శుభ్రంగా, పవిత్రంగా ఉండగలిగే వారు అరుదు. తామరాకుమీద నీటి బొట్టు. ఆకుల్లోంచి కిందికి జారే వెన్నెల రేఖ!''




చెట్లనీ, పువ్వుల్నీ, పిల్ల గాలుల్నీచూసి సంబరపడిపోయే ఆమెతో వాళ్ళేం మాట్లాడగలరు?

అయిదో రోజు ఆదివారం. నలుగురూ ఆమెతో కలిసి ఆమె కోరిక మీదనే ''జూకి'' వెళ్ళారు. అక్కడ ఆమె పసిపిల్ల అయిపోయింది. పక్షులని చూస్తూ నిలబడిపోయింది. కోతులకి అరటిపళ్ళు అందించింది. నిర్బంధంలో ఉన్న పులుల్నీ, సింహాల్నీ, ఏనుగుల్నీ చూసి జాలి పడింది.

''ఈ మహా విశ్వంలో మన భూగోళం మీదనే ఈ జీవచైతన్యం—నిజంగా భూదేవి అదృష్టవంతురాలుకదూ!'' అంది.

వాళ్ళకు ఆమె మాటలు అర్థం కావు. ఏహో సరదా వేళాకోళా లయితే బాగుండేది వాళ్ళకి! అయినా అందమయిన ఆఅమ్మాయిని కుష్ఠురోగులకి భోజనం పెట్టించగలిగే ధనికురాలిని!, ఒంటరిగా రూమ్‌లో

ఉంటున్న సాహసికురాలిని వదలలేరు వాళ్ళు.

'ఇంకా కొంచెం చనువు పెరిగాక..'

నలుగురి మనసులోనూ ఒకే ఆలోచన!

ఆరో రోజు సాయంత్రం...

"ఇవాళ నాకు మరో ప్రోగ్రామ్ ఉంది. మీరు వస్తారా?" అంది.

వాళ్ళు బెదరిపోయి "కుష్ఠు రోగుల ఆశ్రమానికా?" అన్నారు.

నవ్వింది. "కాదు."

"అయితే వస్తాం."

నలుగురి స్కూటర్లూ ఆ అమ్మాయి ఆటోని ఫాలో అయ్యాయి. ఆటో మానసిక రోగుల ఆశ్రమం ముందు ఆగింది.

'హతోస్మి' అనుకున్నారు నలుగురూ. ఆమెని వదులుకోలేక నలుగురూ అనుసరించారు ఆమెని. ఎవడి పుటుకు వాడికే మిగిలిన వాడు ఏం బావు కుంటాడో నని అనూయ. రకరకాల ఆకారాలు! మనిషి కేవలం జంతువని నిరూపించే ఆకారాలు! తన కన్న సంతానాన్ని తల్లే విసిరి పారేస్తే వెన్నెముక దెబ్బ తిని పడుకుని లేవ లేని వాళ్ళు...ఒక చోట చూపు నిలవక కనుగుడ్లు వెర్రిగా తిప్పేవాళ్ళు... అర్థం పర్థం లేకుండా ఎవరిని చూసినా "ఇహిహి!" అని నవ్వేవాళ్ళు.. కళ్ళు కనపడని వాళ్ళు, మాట రాని వాళ్ళు. ఎందరో... ఎవరెవరి పాపాలకో ప్రతినిధులు! ఈ అన్యాయానికి ఎవరిని ప్రశ్నించాలో తెలియక తమ భవితవ్య మేమిటో, ఎవరు చెపుతారో అర్థంకాక రకరకాల దుఃఖాలను మూట కట్టుకుని మవునంగా మోస్తున్న వాళ్ళు...

ఆహార పదార్థాలతో ఉన్న తోపుడు బండిని ఆయాలు తోసుకుంటూ రాగానే అందరి కళ్ళలోనూ ఆశ. వాళ్ళందరి భోజనాలూ కాగానే ప్రార్థనల వరకూ ఉండకుండా వచ్చేసింది రాకెన్.

కానీ, ఆమె ముఖం చూసి ఏం మాట్లాడాలన్నా భయం వేసింది నలుగురికీ.

ఆ అమ్మాయే మాట్లాడింది.

"చూశారా? వాళ్ళకి మతి లేదు. బాహ్యప్రపంచ జ్ఞానం లేదు. ఒంటిమీద బట్ట ఉందో, లేదోకూడా తెలీదు. కాని, తిండి మాత్రం తెలుసు! ఆకలి! అదొక్కటే తెలుసు. మనిషి ఏదో పెద్ద ఎదిగాడను కుంటున్నాం. ఎంత ఎదిగినా మనిషి పట్టె పశువే కదూ?"

ఆ అమ్మాయి ఇలా మాట్లాడినప్పుడల్లా ఆ నలుగురికీ కోపం వస్తుంది, బయటికి చెప్పక పోయినా.

"టాంక్‌బండ్ మీదకి వెళదాం రండి!" అన్నాడు లతీఫ్, మాట మరిపించాలని.

అప్పుడు సమయం రాత్రి ఎనిమిది గంటలు. అయినా ఆ అమ్మాయి వాళ్ళతో రావటానికి ఒప్పు కుంది. వాళ్ళ మనసులు ఆనందంతో, పిచ్చి ఆలోచ నలతో గంతు లేశాయి.

"మీ ఇల్లెక్కడ?" అడిగాడు సింగ్.

ఈ ప్రశ్న ఆ నలుగురూ చాలా సార్లు అడిగారు. ఆ అమ్మాయి గురించి అంతా తెలుసుకోవాలని ఆరాటం!

"ఇక్కడ కాదు!"

రాకేష్ ఎప్పుడూ చెప్పే ముక్తసరి సమాధానం అది.

చందమామ వెన్నెలలు కురిపిస్తున్నాడు. గాలి తెరలు చల్లగా, ఆహ్లాదంగా పరామర్శిస్తున్నాయి శరీరాలని. ఉన్నట్లుండి అడిగింది రాకేష్.

"ఈ జీవితానికి అర్థం ఏమిటి?"

తెల్లబోయారు నలుగురూ. ఇలాంటి పిచ్చి ప్రశ్నలు వాళ్ళెప్పుడూ వేసుకోరు. ఇలాంటి ప్రశ్నలకి సమాధానా లుండవని వాళ్ళకి తెలుసు.

తనే సమాధానం చెప్పింది రాకేష్.

"జీవితానికి అర్థం జీవించటమే! అయితే, జీవించటం కళలన్నింటిలో గొప్ప కళ."

ఏడో రోజు సాయంత్రం రాకేష్ రాలేదు. నలుగురు మిత్రులూ ఆమెకోసం టాంక్‌బండ్ మీద చాలాసేపు ఎదురుచూశారు. ఎనిమిదో రోజూ రాలేదు తొమ్మిదో రోజు నలుగురూ నాలుగు దిక్కులకూ బయలుదేరారు, ఆమె గురించి తెలుసుకోడానికి.




లక్కీగా శాస్త్రికి దొరికింది ఇన్ఫర్మేషన్. తన మిత్రులందరికీ చెప్పాడు, పట్టరాని ఆశ్చర్యంతో.

"ఆ అమ్మాయికి బ్లడ్ కేన్సర్ ..."

అదిరిపడ్డారు మిగిలిన ముగ్గురూ! నమ్మలేనట్లు ముఖాలు పెట్టారు.

"నిజం! ఒట్టు! మా అమ్మమ్మకి ఆపరేషన్ అయితే ఇన్‌టెన్సివ్ కేర్ యూనిట్‌లో పెట్టారు. అక్కడ చూశాను ఆ అమ్మాయిని. వివరాలు తెలుసు కున్నాను. మనం అనుకున్నట్లు ఆ అమ్మాయి గొప్పది కాదు. చాలా బీదవాళ్ళు. ఈ అమ్మాయి స్కూల్ టీచర్‌గా పనిచేస్తూ తలిదండ్రుల్ని పోషి స్తోంది. ఈమెకి బ్లడ్ కేన్సర్ అని తెలిశాక తోటి టీచర్లందరూ చందాలు వేసుకుని అయిదు వే లిచ్చా రట వైద్యానికని. ఇక్కడ బర్కత్‌పురాలో ఈమె రూమ్ తీసుకుని ఉంటున్నది, ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో! తోటి టీచర్లు అక్కడ చేర్చారు—గవర్న మెంట్ ఆస్పత్రిలో సరిఅయిన ట్రీట్‌మెంట్ దొరక దని! సరిఅయిన ట్రీట్‌మెంట్ ఉంటే, మరో అయిదేళ్ళయినా బతకొచ్చని డాక్టర్స్ చెప్పారట! కానీ, ఈ అమ్మాయి ఆ డబ్బంతా కుష్ఠురోగులకీ, మానసిక రోగులకీ, ఇంకా అలాంటి వాళ్ళకీ భోజనాలు పెట్టించటానికి ఖర్చు పెట్టింది. మూడు వేలు ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేసిందట—ఆ వడ్డీతో ఎవరైనా అనాథ విద్యార్థికి స్కాలర్‌షిప్ ఇవ్వమని. మొన్న పరిస్థితి విషమించేసరికి ప్రైవేట్ నర్సింగ్‌హోమ్ నుంచి ఉస్మానియాకి మార్చారు. ప్రస్తుతం ఇన్‌టెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంది."

వింటున్న ముగ్గురిలో ఒక్కరికీ నోట మాట రాలేదు.

"ఒక్కసారి ఆమెని చూడాలి!"

అందరూ అనుకున్నారు. సింగ్‌కి అక్కడి సీనియర్ సర్జన్స్‌లో ఒకరు తెలుసు. ఆ పరిచయంతో ఇన్‌టెన్సివ్ కేర్ యూనిట్‌లోకి ప్రవేశించ గలిగారు

తెరపి మరపులలో ఉంది రాకేష్.

మిలమిల మెరిసే ఆ కళ్ళు నీరసించి పోయాయి. పాలరాతి బొమ్మలాంటి ఆ శరీరం వడిలిపోయింది.

ఆమెని చూసిన నలుగురి కళ్ళలోనూ నీళ్ళు తిరిగాయి.

ఆమెకి తెలివి వచ్చింది. నలుగురు మిత్రులని గుర్తించింది. పలకరింపుగా నవ్వింది. మాట్లాడ డానికి ప్రయత్నించింది.

"నా ఇంటికి వెళ్ళిపోతున్నాను. నా ఇల్లు ఎక్క డుందో మీకు చెప్పలేకపోయాను. నాకు తెలీదు. మీకూ తెలీదు... ఎవరికీ ... ఎవరికీ ... ఎవరికీ ..."

రాకేష్ నోరు శాశ్వతంగా తెరుచుకుని ఉండి పోయింది. డాక్టర్ దానిని మూస్తుంటే వెర్రివాళ్ళలా చూశారు నలుగురూ.

"జీవితానికి అర్థం జీవించటమే! అయితే జీవించటం అన్ని కళలకంటే గొప్ప కళ ..."

రాకేందువదన మాటలు నలుగురి చెవుల్లోనూ గింగురుమన్నాయి.

★